# 10

# వ్యష్టినుండి సమష్టికి ప్రయాణించాలి

**మంచి మనసు, నడత మంచిగ లేకున్న**
**మిమ్ము సాయి ఎట్లు మెచ్చుకొనును?**
**శాంతిప్రేమదాయి సంతోషసుఖదాయి**
**ప్రేమ సాయి ఎట్లు పెంచుకొనును?**

**మా**నవజీవితము సదయమైనది. కాలము పవిత్రమైనది. హృదయము నిర్మలమైనది. మనస్సు మధురమైనది. ఇట్టి పవిత్రమైన జన్మ ఎత్తిన మానవునికి ప్రధానంగా ఉండవలసిందేమిటి? మానవ జీవితభవనమునకు పునాది ఏమిటి? అనే విషయాలను మీరు ముఖ్యంగా గుర్తించాలి.

ప్రతి మానవుడు శాంతి, సుఖములు కావాలని ఆశిస్తున్నాడు. అయితే, శాంతి ఎక్కడ లభిస్తుంది? మానవునియందు మానవతా విలువలు పరిపూర్ణంగా ఉన్నప్పుడే తనకు శాంతి లభ్యమౌతుంది. మానవతావిలువలు మనం బయటినుండి తెచ్చుకునేవి కావు. వాటిని మననుండియే ఆవిర్భవింపజేసుకోవాలి. అట్టి విలువలను మానవుడీనాడు మరచి పోయాడు. ఇంక, తాను సాధించేదేమిటి? తాను దేనికోసం జన్మించినాడో మానవుడు మొట్టమొదట గుర్తించాలి.

సమత, సమైక్యత, సౌభ్రాతృత్వం, సౌజన్యము అనే నాల్గు పునాది గోడలపై మానవజీవితసౌధము ఆధారపడియుంది. ఇందులో ఏ ఒక్కటి కదిలినా మానవత్వమే వ్యర్థమవుతుంది. మానవుడు తన జీవితంలో పోషించుకోవలసినవి, కాపాడుకోవలసినవి ఈ నాలుగే. అయితే, అసలు మానవత్వమంటే ఏమిటో తాను మొట్టమొదట గుర్తించాలి. సత్యమే మానవునియొక్క నీతి, ధర్మమే ఖ్యాతి, త్యాగమే జ్యోతి. ఈ మూడింటి ఏకత్వమే మానవజాతి. కాని, మానవుడు ఈ మూడింటినీ విస్మరించాడు. వీటిని కేవలం సమాజముకోసం మాత్రమే కాదు; తనకోసం తాను ఆచరించాలి. తనను ఇతరులు గౌరవించాలంటే మొట్టమొదట తనను తాను గౌరవించుకోవాలి. అనగా, ఆత్మగౌరవాన్ని పోషించుకోవాలి. అందరినీ గౌరవించాలి, ప్రేమించాలి. ఇదే తన ప్రధానమైన కర్తవ్యం.

### పరులెవ్వరూ లేరు, అంతా పరమాత్మస్వరూపులే

వ్యష్టిస్వరూపుడు జీవుడు, సమష్టిస్వరూపుడు దేవుడు. కనుక, మానవుడు వ్యష్టిస్థాయినుండి సమష్టిస్థాయికి చేరుకోవడానికి ప్రయత్నించాలి. సమష్టిస్థాయిని చేరుకోవలెనంటే అందరియందున్న ఆత్మతత్త్వమనే జీవన జ్యోతిని గుర్తించడానికి ప్రయత్నించాలి. ఇట్టి ఏకత్వాన్ని గుర్తించినప్పుడే సమత్వమనేది అలవడుతుంది. మనం చేసే సేవలన్నీ సమష్టిస్థాయిని పొందే నిమిత్తం చేయవలసిన సాధనలే. సేవ అనేది పరులకు చేస్తున్నామని భావించడం చాలా పొరపాటు. ఈ జగత్తులో పరులెవ్వరూ లేరు, అందరూ పరమాత్మ స్వరూపులే. కాని, ఇట్టి సమష్టితత్త్వాన్ని గుర్తించుకోవడానికి మానవుడు ప్రయత్నించడం లేదు. అందువల్లనే, తాను దుఃఖానికి గురి అవుతున్నాడు.

సర్వత్రా ఉన్నది దైవత్వమే అని గుర్తించినప్పుడు ఇంక తనకు బాధలే ఉండవు. అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తించినప్పుడే మానవుడు సమష్టి తత్త్వమును పొందినవాడవుతాడు.

**దేహాభిమానమును వీడక దైవాభిమానం కల్గదు**

ఈనాడు స్వార్థం పెరిగిపోతున్నది, పరార్థభావము తరిగిపోతున్నది. దేహాభిమానము పెరిగిపోతున్నది, దేశాభిమానము తరిగిపోతున్నది. ఎంతటి గొప్ప సాధకుడైనా, ఎంతటి పవిత్ర హృదయుడైనా దేహాభిమానమును త్యజించలేకపోతున్నాడు. దేహాభిమానం వీడనంత వరకు మానవునికి దైవాభిమానం కలుగదు. ఏమిటీ దేహము?

**పాంచభౌతికము దుర్బలమైన కాయంబు**
**ఎప్పుడో విడిచేది ఎరుకలేదు**
**శత వర్షములదాక మితము చెప్పిరిగాని**
**నమ్మరాదామాట నెమ్మనమున**
**బాల్యమందో మంచి ప్రాయమందో లేక**
**ముదిమియందో లేక ముసలియందో**
**ఊరనో అడవినో ఉదక మధ్యంబునో**
**ఎక్కడో విడిచేది ఎఱుక లేదు**
**మరణమే నిశ్చయమ్మది మానవునకు**
**బుద్ధిమంతుడై తన దేహమున్నయపుడె**
**తన్ను తా తెలియుట ధర్మతత్వ మరయ**
**సత్యమైనట్టి బాట శ్రీసాయి మాట!**

తనను తాను తెలుసుకునే నిమిత్తం మానవుడు దేహమును ధరించాడు. అది తెలుసుకోకుండా ఏవో ప్రాపంచిక విషయాలను తెలుసుకోవాలని ప్రయత్నించడం వెఱ్ఱితనం. తనను తాను తెలుసుకున్నవాడే సర్వమును తెలుసుకున్నవాడవుతాడు. ప్రేమస్వరూపులారా! ఈ ప్రపంచములో అణువు మొదలు ఘనము వరకు ఏఏ పదార్థములున్నవో అవన్నీ మీయందే ఉన్నవి. పర్వతములు, పట్టణములు, పల్లెలు, సముద్రములు, సకల జీవరాశులు... అన్నీ మీ హృదయమునందే ఉన్నవి. మీయందున్న బింబమును విస్మరించి, బయట కనిపించే ప్రతిబింబమును చూసి అదే సత్యమని, నిత్యమని మీరు భ్రమిస్తున్నారు. ఇదెంతటి పిచ్చితనం!

**సత్యధర్మములున్నచోటే శాంతి సమృద్ధిగా ఉంటుంది**

మొట్టమొదట మానవతావిలువలను తెలుసుకోవాలి. వీటిలో మొదటిది సత్యము. ఏ దేశమునకైనా, ఏ కాలమునకైనా సత్యము ఒక్కటే. మార్పు చెందనిది సత్యము. ఇది అమెరికన్ సత్యము, ఇది బ్రిటీషు సత్యము, ఇది పాకిస్థాన్ సత్యము అనే భేదములు లేవు. వేదము "సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, నబ్రూయాత్ సత్యమప్రియం" అని బోధిస్తోంది. కాని, మానవుడు ఇటువంటి శాశ్వతమైన తత్త్వమును విస్మరించి అనిత్యమైన పదార్థముల నిమిత్తం ప్రాకులాడుతున్నాడు. సత్యమైన నడతయే నీతి. అట్టి నీతిని పోషించుకోవాలి. మీరు సత్యస్వరూపులు. సత్యమే దైవము. ఈ సత్యాన్ని మీరు మొట్టమొదట గుర్తించాలి. సత్యమునకు ఆధారము ధర్మము. "సత్యాన్నాస్తి పరో ధర్మః" సత్యధర్మముల ఏకత్వముచేతనే శాంతి ఏర్పడుతుంది. ఎవరు సత్యధర్మములతో జీవితాన్ని గడుపుతారో వారియందు శాంతి సమృద్ధిగా ఉంటుంది. శాంతి ఎక్కడని మనం వెదకనక్కర్లేదు. సత్యధర్మములున్నచోటే శాంతి ఉంటుంది. ఈ మూడూ ఉన్నచోట అహింస సహజంగా ఏర్పడుతుంది. అయితే, వీటన్నింటికీ మూలాధారమైనది ప్రేమ. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలే మన

పంచప్రాణములు. ఈ పంచప్రాణములే పరమాత్మ స్వరూపములు. మనలో సత్యము లేకపోయిన ఒక ప్రాణము పోయినట్లే. ధర్మము మనలో క్షీణించెనా, రెండు ప్రాణములు పోయినట్లే. ఈ ప్రాణములను మనం సంరక్షించుకోవాలి.

**ప్రకృతి ఒక అద్దమువంటిది**

ఈనాడు ఉద్యోగ, వ్యాపారాది అన్ని రంగములూ మలినమై యున్నవి. దీనికి కారణమేమిటి? మానవుని హృదయంలో మాలిన్యం ప్రవేశించింది. హృదయాన్ని పవిత్రం గావించుకున్నప్పుడు సర్వము పవిత్రంగానే గోచరిస్తుంది. హృదయముయొక్క ప్రతిబింబమే జగత్తు. హృదయములో ప్రేమను నింపుకున్నప్పుడు జగత్తంతా ప్రేమమయ మౌతుంది. ప్రకృతి ఒక అద్దమువంటిది. అద్దమునందు ప్రతిబింబము తప్ప మరొకటి కనిపించదు. కనుక, ఈ ప్రపంచములో మనం చూసేది, అనుభవించేది అంతా మన 'రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్'లే! చెడ్డ ఏమైనా కనిపించెనా, అది మన ప్రతిబింబమే. చెడ్డదేమైనా విన్నామా, అదీ మనయొక్క ప్రతిబింబమే. మనయందున్న మంచిచెడ్డలే మనకు బయట కనిపిస్తున్నాయి. కనుక, మనం పరులపై ఏమాత్రం దోషారోపణ చేయకూడదు. ఈ ప్రపంచ మంతయు మానవుని ప్రవర్తన, పరివర్తనలపైనే ఆధారపడియున్నది. మనిషి మంచివాడైనప్పుడే ప్రపంచము మంచిదవుతుంది. మానవుడు దైవంగా రూపొందితే జగత్తంతా తనకు దైవస్వరూపంగానే గోచరిస్తుంది. తాను రాక్షసునిగా మారిపోతే ప్రపంచమంతటా తనకు రాక్షసత్వమే కనిపిస్తుంది.

ప్రేమస్వరూపులారా! మీహృదయంలో ప్రేమను నింపుకోవాలి. మీ మాటలందు, చేతలందు సత్యధర్మములు ప్రతిబింబించాలి. అప్పుడే మీరు శాంతిని పొందగలరు. సత్యము మీనుండియే ఆవిర్భవిస్తున్నది. ఏవిధంగా? మీ ఉచ్ఛ్వాస నిశ్వాసములు రోజుకి 21,600 పర్యాయములు మీకు "సోఽహం" (నేనే దైవం) అనే సత్యాన్ని బోధిస్తున్నాయి. దీనిని మీరు జ్ఞప్తియందుంచుకోలేకపోయినప్పుడు ఇంక, మీ చదువులెందుకు? మీరెన్ని గ్రంథములు పఠించినప్పటికీ, ఎందరు పెద్దలను దర్శించినప్పటికీ మీయందున్న సత్యాన్ని మరచిపోతే అవన్నీ వ్యర్థమైపోతాయి.

**ఇంద్రియాలను సద్వినియోగపరచుకోవాలి**

మొట్టమొదట మీ దృష్టిని, మీ శ్రవణమును చక్కదిద్దుకోవాలి. బుద్ధుడు చేసిందికూడా అదే. తాను సర్వసంగపరిత్యాగియై అనేకమంది పెద్దలను దర్శించాడు, వారి ప్రబోధలను విన్నాడు, అనేక గ్రంథములను పఠించాడు. కాని, అతనికి తృప్తి కల్గలేదు. కట్టకడపటికి సత్యాన్ని గుర్తించుకొని గ్రంథములన్నింటినీ ప్రక్కనపెట్టి, తన దృష్టిని అంతర్ముఖం చేసుకొని, తన పంచేంద్రియాలను పవిత్రం గావించుకున్నాడు. మీరు మొట్టమొదట భగవంతుడు మీకు ప్రసాదించిన కన్నులను సద్వినియోగపరచుకోవాలి. దృష్టి పవిత్రంగా ఉంటే మీ జీవితమే పవిత్రమౌతుంది. మీ నేత్రమే భగవంతుడిచ్చిన శాస్త్రము. ఈ శాస్త్రాన్ని మీరు చక్కగా అర్థం చేసుకోవాలి. దృష్టిని అరికట్టుకున్నప్పుడు నాలుక దానంతటదే అదుపులోకి వచ్చేస్తుంది. సమ్యక్‌దృష్టి, సమ్యక్‌వాక్కు, సమ్యక్ శ్రవణం – వీటిని అలవర్చు కున్నప్పుడు మనస్సు పవిత్రమైపోతుంది. మంచి మనస్సు, మంచి నడత గలవాడే నిజమైన మనిషి. ఇంద్రియాలను అదుపులో పెట్టుకొని, మానవతావిలువలను ఆచరణలో పెడితే మానవుడే మాధవుడౌతాడు.

ఈనాటి యువతీయువకులే భావిభారతోద్ధారకులు. కనుక, మొట్టమొదట వాళ్ళు స్థిరత్వాన్ని పోషించుకోవాలి. ఆత్మవిశ్వాసమును అభివృద్ధి చేసుకోవాలి. విశ్వాసమెక్కడో ప్రేమ అక్కడ. ప్రేమ ఎక్కడో సత్యమక్కడ. సత్యమెక్కడో శాంతి అక్కడ. శాంతి ఎక్కడో ఆనంద మక్కడ. ఆనందమెక్కడో దైవమక్కడ. కనుక, ఆత్మవిశ్వాసము చాలా

ప్రధానమైనది. విశ్వాసము లేనివానికి దైవము లభ్యం కాదు. మీ విశ్వాసమే మీ దైవము. కనుక, మీ విశ్వాసము చలించకుండా చూసుకోండి. ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవము గలవానికే ఆత్మానందము లభ్యమౌతుంది, ఆత్మసందర్శనము కల్గుతుంది. మీరందరూ ఇక్కడ ఇంతపెద్ద హాలులో కూర్చున్నారు. ఈ హాలులో అనేక స్తంభాలు కనిపిస్తున్నాయి. దీని అందచందములు మీకెంతో ఆనందాన్ని కల్గిస్తున్నాయి. దీనికంతటికీ ఆధారమైనది ఏది? పునాదియే కదా! అదేరీతిగా, మీ జీవిత భవనమునకు Self-confidence (ఆత్మ విశ్వాసము) పునాదివంటిది. Self-satisfaction (ఆత్మసంతృప్తి) – Walls (గోడలు). Self-sacrifice (స్వార్థత్యాగం) – Roof (పై కప్పు). Self-realisation (ఆత్మసాక్షాత్కారం) – Life (జీవితం). కనుక, మొట్టమొదట ఆత్మవిశ్వాసమనే పునాదిని మీరు భద్రం చేసు కోవాలి.

భారతీయసంస్కృతి "సత్యం వద, ధర్మంచర," అని ప్రబోధిస్తున్నది. అయితే, ఒక్క భారతీయ సంస్కృతి మాత్రమే కాదు, అన్నిదేశాల సంస్కృతులూ ఇదే సత్యాన్ని ప్రబోధిస్తున్నాయి. ఈ ప్రపంచమంతా ఒకే ఇల్లు. ఒక్కొక్క దేశము ఒక్కొక్క గదివంటిది. 'ఈ దేశము వేరు, ఆ దేశము వేరు' అంటూ విభాగము చేయకండి. ఈ విభాగము చేతనే మానవత్వము చెడిపోతున్నది. ముఖ్యంగా సాయిభక్తులైన మీరు ఎలాంటి భేదములకూ చోటివ్వకూడదు. అందరూ ఏకం కావాలి. రూపనామములందు భేదము లుండవచ్చుకాని, మానవులందరిదీ ఒకే కుటుంబము.

**పశుల వన్నెలు వేరు, పాలు ఒక్కటే**
**జీవజంతులు వేరు, జీవుండు ఒక్కడే**
**జాతినీతులు వేరు, జన్మమొకటే**
**పూలవన్నెలు వేరు, పూజ ఒకటే**
**దర్శనంబులు వేరు, దైవమొకడే**

కనుక, మీరు జాతిమతభేదములను త్యజించి ప్రేమతత్త్వాన్ని పెంచుకోవాలి. యువతీ యువకులు చక్కబడినప్పుడే దేశము బాగుపడుతుంది. మానవ జీవితము శీలముపైనే ఆధారపడియున్నది. శీలరహితులైన యువతీ యువకులవల్లనే దేశము నాశనమైపోతున్నది.

**"ఇది నా దేహము కాదు, మీ దేహము"**

ప్రేమస్వరూపులారా! మీ జీవితాన్ని ప్రేమమయం గావించుకోండి. మీ హస్తములను పరోపకారసంబంధమైన పనులలో ప్రవేశపెట్టండి. వ్యష్టి స్థాయినుండి సమష్టి స్థాయిని చేరుకొని, సమష్టి స్థాయినుండి పరమేష్ఠిలో ఐక్యం కావడానికి కృషిచేయండి. దేహాభిమానమును త్యజించండి. దేహము వస్తుంది, పోతుంది.

**మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవకగంప జాతసం**
**చలనముపొందు దుంప భవసాగరమీదగలేని కంప అం**
**బుంబులపొది లెమ్ము చూడ మన ముప్పుదలంపగ దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే.**

మానవునికి తన అజాగ్రత్తవలన కొన్ని రోగములు సంభవిస్తుంటాయి. అయితే, నేను ప్రేమతత్త్వంచేత భక్తుల బాధలను స్వీకరిస్తుంటాను. అవి వచ్చినవి వచ్చినట్లుగానే పోతాయి. ఒక చిన్న ఉదాహరణ. నా స్వానుభవమే మీకు బోధిస్తున్నాను. ఇటీవల ఒక బిడ్డకు దవడపైన వాపు వచ్చింది. ఆ బిడ్డ భరింపలేనంత బాధననుభవిస్తున్నాడు. డాక్టర్‌కి చూపిస్తే ఆ వాపు 20, 25 రోజులు ఉంటుందన్నాడు. వాడు ఏడుస్తున్నాడు పాపం! నేను లోపలికి పిలిచాను. "నీవు ఏడ్వవద్దు. స్వామి నీవెంట ఉన్నప్పుడు ఎందుకు ఏడ్పు?" అని ఒక స్వీటు

సృష్టించి తినిపించాను. ఆ బాధను నేను తీసుకున్నాను. ఇది నిజంగా దేహంలో పుట్టినదే అయితే భరించలేనంత బాధ ఉంటుంది. ఈ వాపు రెండు దవడలకుమధ్య Joint దగ్గర వచ్చింది. మాట్లాడటానికి వీలుకాదు. తినడానికికూడా వీలుకాదు. ఈ దేహానికి కొన్ని దినాలు భోజనం లేకపోతే వచ్చే నష్టమేమిటని నేను లెక్క చేయలేదు. "స్వామీ! గురుపూర్ణిమ పండుగను ఎట్లా జరిపేది? అంతర్జాతీయ సేవాసమ్మేళనానికి మీరు ప్రారంభోత్సవము చేయాలి కదా! ఆ రోజున ఎట్లా మాట్లాడతారు?" అని శ్రీనివాసన్ *(అఖిల భారత శ్రీ సత్యసాయి సంస్థల అధ్యక్షులు)* చాలా బాధపడ్డాడు.

నేను చెప్పాను: "ఇది నా దేహమని నేననుకుంటే నాకీ బాధ ఉంటుంది. ఇది నా దేహము కాదు, మీ దేహము. మీ దేహాలన్నీ నావి. కనుక, మీ బాధలన్నీ నేను తీసుకుంటాను. అది నా కర్తవ్యము. ఇది నా దేహము కాదు. కనుక, నేను దీనిని లక్ష్యము చేయను. ఇప్పుడే కాదు, ఎప్పుడు ఏ బాధ కల్గినా నేను లక్ష్యము చేయను. ఈరీతిగా, ప్రతి విషయమును నేను అనుభవించి మీకు బోధిస్తున్నాను. నా జీవితమే నా సందేశము."

ఐతే, కొన్ని విషయాలను నేను పబ్లిక్‌గా చెప్పడానికి వీలుకాదు. అడ్వర్‌టైజ్ చేసుకోవడం నాకు ఎప్పుడూ ఇష్టం లేదు. నాది మీదే, మీది నాదే. నాకు కాలినుండి తలవరకు ఎట్టి ఆశలూ లేవు. మీకు ఆనందమును అందించాలన్నదే నాకున్న ఒక్కగానొక్క ఆశ. కేవలం బోధించడంలో గొప్పతనం లేదు. ఆచరించి బోధించడమే ఆచార్యుని లక్షణం. కనుక, ప్రతి చిన్న విషయాన్ని నేను ఆచరించి, అనుభవించి మీకు అందిస్తున్నాను.

యువతీ యువకులారా! ఈ దేహానికి పెట్టిన పేరు సత్యము. ఈ సత్యమును మీరు అందరియందు చూడండి. అప్పుడే మీరు దైవత్వాన్ని పొందగలరు. సత్యమే దైవము. ప్రేమయే దైవము. మీ జీవితాన్ని ప్రేమమయము గావించుకోండి. అప్పుడు మీరెంతైనా ఆనందమును పొందగలరు.

***(తేది: 21.07.2002 ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశమునుండి)***